క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన

మణుగూరుటౌన్: సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ అన్నారు. సోమవారం డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మణుగూరులోని ప్రజలకు ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచిత ఫోన్‌కాల్స్, మెసేజ్‌లపై అప్రమత్తత ఉండాలన్నారు. అదేవిధంగా వివిధ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని వచ్చే మెసేజ్‌లకు స్పందించకపోవడమే మంచిదని ఆఫర్లతో వచ్చే ఫోన్‌కాల్స్ ఆ తర్వాత వచ్చే మెసేజ్‌లను క్లిక్ చేయరాదన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలతో మోసపోయి ఆర్థికంగా నష్టపోయిన వారిని ఉదాహరిస్తూ తోటి మిత్రులకు అవగాహన కల్పించి సైబర్ నేరాల నుంచి ప్రజలను తప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

కూలీలను పట్టించుకోవడం లేదు..

అశ్వాపురం: ఉపాధి హామీ పనుల్లో కూలీలకు గాయాలైనా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు దండి రాములు అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లెలమడుగు గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో ఇటీవల పిండిపోలు నిర్మలకు ఎండదెబ్బకు కళ్లు తిరిగి గొయ్యిలో పడి కన్నుకు గాయమైందన్నారు. ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడంతో ఆమె భద్రాచలంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుందన్నారు. కూలికి వెళ్తేనే వాళ్ల కుటుంబం గడుస్తుందని పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, అధికారులు, సిబ్బంది స్పందించి ఆమెకు ఉచితంగా వైద్యం అందించాలని అన్నారు. త్వరగా కోలుకునేలా వైద్యం అందిచాలని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మల్లన్నను గెలిపించండి

అన్నపురెడ్డిపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ పిడమర్తి రవి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పట్టభద్రులకు వివరించి, ఓటు అభ్యర్థించాలని కోరారు. నాయకులు వక్కలగడ్డ సోమశేఖర్, నరేష్, దోసపాటి రాంబాబు, బోడా పద్మ, దుబ్బాకుల రాము,లకావత్ రాజు, రుంజా బుచ్చమ్మ, ఇనపనూరి జమలయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చండ్రుగొండ: మండలంలోని గుర్రాయిగూడెం గ్రామంలో కాక కృష్ణయ్య అనే రైతుకు చెందిన ఆవు సోమవారం విద్యుదాఘాతానికి మృత్యువాత పడింది. బాధితరైతు కథనం ప్రకారం రోజులాగే పంటచేల వద్ద మేతకు వెళ్లింది. గ్రామశివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని అతడు వేడుకుంటున్నాడు.

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం కేంద్రంగా గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ స్టేట్ కోఆర్డినేటర్ తెల్లం నరేష్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళా డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్ ఇక్కడ చదివిన విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో దూర, ఆర్థిక భారం పెరిగి విద్యార్థులు ఇంటర్‌తోనే చదువు ఆపేసి వ్యవసాయ కూలీలుగా మారాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా కళాశాల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతాధికారులు చొరవ చూపి సంబంధించిన నివేదికలు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని ఆయన కోరారు.

బీరప్ప-కామరాతి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: కురుమల ఆరాధ్య దైవం బీరప్ప స్వామి, కామరాతి అమ్మ వార్ల కల్యాణాన్ని సోమవారం వైభవంగా జరిపించారు. మండల పరిధిలోని పెంట్లం గ్రామంలోని బీరప్ప స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకొని కురుమలు డిల్లెం, బల్లెం అంటూ బీరడోళ్లతో పెద్దబాకలతో సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఒగ్గు కళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకుని, ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి అన్నపురెడ్డిపల్లి శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు రూ.25 వేలు అందజేశారు. కల్యాణంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలలో జరిగిన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- పొలాలు చదును చేయడంలో రైతులు బిజీబిజీ
- అడపా దడపా వర్షాలతో వేసవి దుక్కులు
- రోహిణి కార్తె సమీపిస్తుండడంతో చకచకా పనులు



పెద్దిపల్లిలో వేసవిదుక్కి దున్నుతున్న రైతు

చర్ల: వానాకాలం సమీపిస్తుండడంతో రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు భూమి తడుస్తుండడంతో వేసవి దుక్కుల వైపు దృష్టి మళ్లిస్తున్నారు. గత ఏడాది పంటలకు వాతావరణం అంతగా అనుకూలించకపోవడం, పండించిన మిర్చి, పత్తి పంటలకు ఆశించిన మేర ధర లేకపోవడంతో రైతులు ఈ ఖరీఫ్‌లోనైనా గత ఏడాది కలిగిన నష్టాలను పూడ్చుకునేందుకు ఆశతో ఖరీఫ్ పనులు ఆరంభిస్తున్నారు. ఈ నెల 25 నుంచి రోహిణికార్తె ఆరంభం కానుండడంతో ఈ లోపే వేసవి దుక్కులు చేసి అటు తరువాత కురిసే వర్షాలకు దుక్కుల్లో నీరు ఇంకేలా చర్యలు చేపడుతున్నారు. చర్ల మండలంలోని మామిడిగూడెం, దేవరాపల్లి, కుదునూరు, ఆర్ కొత్తగూడెం, సత్యనారాయణపురం, పెద్దిపల్లి, కలివేరు, తేగడ, గొమ్ముగూడెం, దండుపేట, కొత్తపల్లి, లింగాపురం, మొగళ్లపల్లి, చింతకుంట, జీపీపల్లి, వీరాపురం, కొయ్యూరు, సుబ్బంపేట, చినమిడిసిలేరు, పెదమిడిసిలేరు, ఆంజనేయపురం, కుర్నపల్లి, బోదనెల్లి, పులిగుండాల తదితర గ్రామాలలో రైతులు వేసవిదుక్కులు చేయడం ఆరంభించారు. మండలంలో వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను వ్యవసాయశాఖాధికారులు కూడా రైతులకు వివరిస్తుండడంతో వేసవి దుక్కుల పట్ల రైతులు మరింతగా ఆసక్తిని చూపుతున్నారు.

వేసవి దుక్కులు ఎంతో మేలు...

వేసవి దుక్కులు దున్నే ముందు రైతులు పశువుల ఎరువు, కంపోస్టు ఎరువుల వంటివి భూమిలో చట్టుకోవడం వల్ల నేల సారవంతంగా తయారవుతుంది. వేసవి దుక్కులతో కలుపు మొక్కలను నివారించవచ్చు. పురుగులు, వివిధ రకాల తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చును. వేసవిలో భూమి దుక్కి చేసినప్పుడు భూమిలో ఉన్న శిలింద్ర బీజాలు నేలపైకి వస్తాయి. వరి వేసే రైతులు పొలం మడులను ఒక సాలు దున్నడంతో దుక్కి దిగబడకుండా ఉంటుంది.

దుక్కులు చేసేటప్పుడు జాగ్రత్తలు..

- కనీసం 30 సెంటీమీటర్ల లోతు దుక్కి వచ్చేలా దుక్కి చేసుకోవాలి.
- పొలాన్ని అడ్డంగా దున్నాలి. నిలువుగా దున్నడం వల్ల వర్షం కురిస్తే మట్టి కొట్టుకుపోయే అవకాశం ఉన్నందున రైతులు పొలాలలను అడ్డంగానే దున్నాలి.
- రోటోవేటర్‌తో తక్కువ సమయంలో దుక్కులు దున్నవచ్చు. కానీ ప్లవ్‌తో దున్నితే దుక్కి లోతుగా వస్తుంది.
- నాగలితో దున్నితే పొలం చదునుగా కూడా ఉంటుంది.
- వర్షం పడగానే పట్టిరొట్ట, జీనుగు విత్తనాలను పొలాల్లో చల్లుకోవాలి.
- రైతులు విత్తనాలు విత్తే వరకు భూములను రైతులు సమానంగానే ఉంచుకోవాలి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరిస్తున్నాం. వేసవి దుక్కుల వల్ల పంటలో కలుపు మొక్కలను నివారించవచ్చు. తెగుళ్ల బారి నుంచి పంటలను రక్షించుకోవడంతో పాటు వివిధ రకాల పురుగుల నుంచి పంటలను రక్షించుకోవచ్చు. దుక్కులు చేసుకునే ముందు పొలాల్లో పశువుల ఎరువు వేయడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుంది. పంటల సాగుకు సంబంధించి రైతులు తమను సంప్రదించాలి.

– పి.శివరాంప్రసాద్, మండల వ్యవసాయశాఖ అధికారి, చర్ల

'సెంట్రల్' పనుల్లో కదలిక



యంత్రాలతో విద్యుత్ స్తంభాలు వేస్తున్న దృశ్యం

ములకలపల్లి: మండలకేంద్రంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ములకలపల్లిలో 1.2 కిమీ మేర సెంట్రల్ లైటింగ్, ఫోర్‌లైన్ బీటీ రోడ్డు, డివైడర్ నిర్మాణానికి నిధులు మంజూరుకాగా, మార్చి నెలలో పనులు మొదలుపెట్టారు. ఆర్అండ్‌బీ పరిధిలోని నిర్మాణాలను తొలగించారు. ఇళ్లు, దుకాణాల ముందర నిర్మాణాలు, ఫ్లోరింగ్‌లను తొలగించారు. పనులు సజావుగా సాగుతున్న తరుణంలో అర్ధాంతరంగా ఆపేశారు. నిర్మాణాలు తొలగించి, పనులను నిలిపివేశారు. సుమారు రెండు నెలల పాటు పురోగతి లేదు. ఫ్లోరింగ్ తొలగించడంతో రోడ్డుకిరువైపులా గోతులమయం కావడం, ఇంటిముందర తాత్కాలిక నిర్మాణాలు తీసేయడంతో ఎండలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వివరిస్తూ 'మొదలుపెట్టి.. వదిలిపెట్టి..' శీర్షికన ఈ నెల 11వ తేదీన 'సాక్షి' పత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో నిలిచిన పనుల పట్ల అధికారులు దృష్టి సారించారు. సోమవారం పనులు మరలా మొదలుపెట్టారు. విద్యుత్ లైన్ల పనులు షురూ చేశారు. యంత్రాల సహాయంతో రోడ్డు కిరువైపులా స్తంభాలు వేస్తున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరంతాయంగా పనులు చేయాలని, సకాలంలో పూర్తి చేయాలని కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

ములకలపల్లి: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పాతగంగారం ఎంపీటీసీ మడకం విజయ అన్నారు. ముత్యాలంపాడు శివారులోని వాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వానొస్తే వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, దీంతో ముత్యాలంపాడు, రాచన్నగూడెం జీపీలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయని అన్నారు. ఈ క్రమంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుకాగా, చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. యద్ధప్రాతిపదికను పనులు కొనసాగించి, వర్షాకాలంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఆటో యూనియన్ అడ్డా ఏర్పాటు

దుమ్ముగూడెం: మండల పరిధిలోని పర్ణశాల గ్రామంలో సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం వద్ద శ్రీ సీతారామ ఆటో యూనియన్ అడ్డాను సోమవారం ఏర్పాటు చేసేకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పానుగంటి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా పిల్లి సుబ్రమణ్యం, కార్యదర్శిగా తంతరపల్లి నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

దమ్మపేట: తెలుగుదేశం పార్టీకు చెందిన పలువురు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో ఎమ్మెల్యే జారే, స్థానిక కాంగ్రెస్ నాయకుల సమక్షంలో టీడీపీకు చెందిన పలువురు, కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాత, కొత్త అనే వర్గ విభేదాలకు తావులేకుండా అందరూ కలసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో నందమూరి సూర్యారావు, నాగు, చందా సుబ్బారావు, జోగారావు, ప్రసాద్, సుధాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం గంగులగూడెం గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన పెనుబల్లి నాగరాజు చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

చండ్రుగొండ: అగ్నిప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని మహ్మద్‌నగర్‌లో ఇటీవల విద్యుదాఘాతానికి బడేమియా అనే వ్యక్తి పూరిల్లు కాలిపోయిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమవారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వం నుండి సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. తిప్పనపల్లిలో ఇటీవల మృతి చెందిన మైనారిటీ నాయకుడు యుసుఫ్‌మియా, చండ్రుగొండ జర్నలిస్టు కోటాచారి కటుంబాలని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు భోజ్యానాయక్, దారం గోవిందరెడ్డి, సారేపల్లి శేఖర్, ఎస్సీ సైదా, రసూల్, లంకా విజయలక్ష్మి, రుక్మిణి, సంకా శంకర్ ఉన్నారు.

రాకేష్‌రెడ్డిని మెజార్టీతో గెలిపించాలి

మణుగూరురూరల్: ఈ నెల 27న జరిగే ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని పివికాలనీలో గల భద్రాద్రి స్టేడియం, అంబేద్కర్ పార్క్‌లలో మార్నింగ్‌వాక్ చేస్తున్న పట్టభద్రులను జెడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకులు కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఉన్నత చదువులు చదివిన విద్యావేత్త, ప్రజాసేవ కై ఉన్నత ఉద్యోగాన్ని వదిలిపెట్టిన త్యాగశీలి, సౌమ్యుడు రాకేష్‌రెడ్డి అని తెలిపారు. రాకేష్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే గ్రాడ్యుయేట్ యువత సమస్యలపై గళమెత్తి న్యాయం చేసేందుకు కృషి చేస్తారన్నారు. ఎన్నికల్లో పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును కారు గుర్తుపై వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముత్యంబాబు, కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, టీబీజీకేఎస్ నాయకులు నాగెళ్లి, నాయకులు వల్లభనేని రమణ, మడి వీరన్నబాబు, అక్కి నరసింహారావు, యు.రామారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు కొరకు మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో వాకింగ్ చేస్తున్న వారిని కలిసి ఓట్లను అభ్యర్థించారు. సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి విద్యావంతుడు రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మానె రామకృష్ణ, ధనేశ్వరరావు, సునీల్, పట్టాభి, ప్రదీప్, వెంకటేశ్వర్లు, ఖాసీం, సుబ్బారావు, సమర్ కుమార్, రంజిత్, సలోమి, మరియమ్మ పాల్గొన్నారు.



మణుగూరురూరల్: ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరసింహారావు

క్రీడలు స్నేహబంధాన్ని పెంచుతాయి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: నిత్యం యువత క్రీడా పోటీలలో పాల్గొనడం వలన నూతన స్నేహితులను పెంచుకుంటారని, దాంతో పాటు పోటీలు దేహదారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం మండలంలోని గోవిందాపురం గ్రామంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న కొమరం భీం క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నీలో విజేతగా నిలిచిన చిన్నబండిరేవు జట్టుకు, రన్నర్ దబ్బనూతులా కొత్తూరు జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ మాజీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విరమాచినేని వినీల్, నాయకులు లంక శ్రీనివాసరావు, పిలక వెంకటరమణారెడ్డి, దర్శి సాంబశివరావు, తెల్లం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరికొయ్యలు కాల్చొద్దు



కాలబెడుతున్న వరి కొయ్యలు

అశ్వాపురం: రబీ సీజన్ ముగిసి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండటంతో ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండటంతో రైతులు వానాకాలం సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు వరి పొలాల్లో వరికొయ్యలను కాలుస్తున్నారు. వరి పొలాల్లో వరికొయ్యలు కాల్చడం వల్ల భూసారం తగ్గి పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు అలా చేయవద్దని వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరికొయ్యలు తగలబెట్టడం వల్ల ఆ ప్రాంతంలో భూమి బిగువుగా మారి నీటిని పీల్చుకునే గుణాన్ని కోల్పోయే అవకాశం ఉంటుంది. కాల్చిన చోట భూమి సేంద్రీయ పదార్థాన్ని కోల్పోతుంది. వరికొయ్యలను ప్రతి ఏడాది కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. పంటలకు తోడ్పడే సూక్ష్మ జీవులపై తీవ్ర ప్రభావం పడుతుంది. కొయ్యకాలును పొలాల్లోనే ఉంచాలని జీలుగు, పిల్లి పెసర వంటివి సాగు చేయడం వల్ల భూసారం పెరిగి దిగుబడులు పెరుగుతాయని కొయ్య కాలు కాలిస్తే సూక్ష్మజీవులు చనిపోయి పంట దిగుబడి తగ్గుతుందని రైతులు గమనించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కొయ్యకాలు కాలబెట్టద్దని రైతులకు అవగాహన కల్పించాలని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సందర్శన



చేతిపంపును పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

ములకలపల్లి: నీటి ఎద్దడితో అల్లాడుతున్న మొగరాలగుప్ప గ్రామశివారు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంతాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు సోమవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాగునీరందించే బోరుకు తాత్కాలికంగా చేతిపంపు ఏర్పాటు చేశారు. కొత్తబోరు వేసేందుకు బోరు పాయింట్ ఖరారు చేశారు. శాశ్వతంగా తాగునీటి కొరత తీర్చుతామని అధికారులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేశ, డీఈ సలీం, ఎంపీఓ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

భద్రాచలంటౌన్: తెలుగు సినిమా హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా అభిమానులు తలసేమియా, సికెల్ సెల్ అనీమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నందు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అభిమాన కథనాయకుడి పుట్టినరోజు సందర్భంగా స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసిన రక్తదాతలను శాలువతో సన్మానించి అభినందించారు. తల సేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉందని, ఆరోగ్యంగా ఉన్న యువత, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైద్యాధికారి చంద్రప్రసాద్, రెడ్ క్రాస్ స్టేట్ ఈసీ మెంబర్ సూర్యనారాయణ, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు వెంకన్న, సతీష్, రవికృష్ణ, మహేష్, కిరణ్, శ్రీను, గురవయ్య, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ఆదినారాయణ, రవికుమార్, పార్థసారథి పాల్గొన్నారు.

ఊరవాగుపై కల్వర్టు నిర్మాణం



పోలీసుల ఆధ్వర్యంలో ఊరవాగుపై కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణం..

గుండాల: బాటన్న నగర్-రాయిగూడెం మధ్య ఊర వాగుపై ఆళ్లపల్లి పోలీసుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా శ్రమంచి కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాయిగూడెం గ్రామస్తులు రోడ్డు సమస్య పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రకటించారు. అయితే పలువురు రాజకీయ నాయకులతో పాటు ఆళ్లపల్లి ఎస్సై రతీష్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దీంతో ఓట్లు వేయడానికి ముందుకు వచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఎస్సై రతీష్ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల సలహాలు తీసుకుని ఆర్అండ్‌బీ అధికారుల సహకారంతో రెండు రోజుల నుంచి నిర్మాణ పనులు చేపట్టారు. ఊరవాగుపై పైపులు వేసి, మట్టి పోయించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలలో మట్టి కూడా పోయించారు. దీంతో రాయిగూడెం-బాటన్న నగర్ మధ్య రాకపోకలకు అంతరాయం తొలగిపోయింది. జిల్లా అధికారులతో మాట్లాడి శాశ్వత రోడ్డు కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలి

దమ్మపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అశ్వారావుపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ దూళి శ్రీకాంత్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, ముసలయ్య, గోడ ముత్యాలరావు, ప్రశాంత్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

చర్లరూరల్: ఖమ్మం,నల్గొండ,వరంగల్ జిల్లాల భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపునకు చర్ల పట్టణంలో సోమవారం ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించారు.పార్టీ మండల కార్యదర్శి పుగాకు పూర్ణ చందు ఆధ్వర్యంలో ఓటరు స్లిప్పులు, కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బి.క్రాంతి కుమార్, నాయకులు సాధం లోకనాథం, ప్రభాకర్, శేషగిరి, విశ్వనాథ్, బి.మధు, నల్లూరి ఉదయ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలతో బీజేపీ నాయకులు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఆమెర్ద కాలనీలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా 33/11 కేవీ విద్యుత్ తీగలు



అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలోని అమెర్ద కాలనీలో ఇండ్ల మధ్య విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. 33/11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్ల మధ్య, ఇళ్లపైన, ఇండ్లను తాకుతూ చేతికి అందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇంటిపై ఆడుకుంటుండగా సోమవారం ఏడేళ్ల బాలుడికి విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో గాయాలయ్యాయి. గతంలో విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందా అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ తీగల సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. అధికారులు పట్టించుకోవడం లేదని విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ తీగల వల్ల ప్రాణాపాయం జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగల సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.